క్లుప్తంగా

అవయవదానం మరొకరికి ప్రాణదానం

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: అవయవదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లని స్త్రీ, శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవయవదానంపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అవయవదానం చాలా మంచి ఆలోచన అని అన్నారు. చనిపోయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరెందరికో ప్రాణదానం చేసినట్లు అవుతుందని వివరించారు. 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం కళాశాలలో నూతన ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వాడాడ గణేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఇప్పిలి దిలీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే పునాది



మిర్తివలస డీపీఈపీ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

బలిజిపేట: విద్యార్థులకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమైనదని, విద్యార్థులలో సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు ఇదే పునాది అని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. మండలంలో మిర్తివలస డీపీఈపీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్‌బుక్స్ పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, షూ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన ఇసుక మేటల తొలగింపు

● ఐటీడీఏ పీఓ వీవీ రమణ



ఇసుక మేటలపై చర్చిస్తున్న ఇన్‌చార్జ్ పీఓ రమణ, ఈఈ రామచంద్రమూర్తి, ఏజీఎం కుమారస్వామి

భామిని: మండలంలోని కాట్రగడ - బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ చానల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను యుద్ధ ప్రాతిపదికన తరలించడానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారి వీవీ రమణ ఆదేశించారు. వంశధార ప్రాజెక్ట్ ఈఈ రామచంద్రమూర్తి, డీఈఈ భవానీశంకర్, ఏపీఎండీసీ ఏజీఎం కుమారస్వామి, ఆర్‌టీఓ వేణుగోపాలరావులతో కలిసి ఓపెన్ హెడ్‌చానల్‌ను శుక్రవారం సందర్శించి, పేరుకుపోయిన ఇసుక మేటలను పరిశీలించారు. వంశధార నది నుంచి వరదనీరు ప్రవేశించే సమయంలో ఇసుక మేటలు తరలివచ్చి పేరుకుపోతున్నాయని గుర్తించారు. హెడ్ రెగ్యులేటర్ ద్వారా సైడ్ వియ్యర్‌లో ఇసుక మేటలు నిండిపోవడంతో వరదకాలువలోకి నీరు పారడం లేదని వంశధార ఇంజినీర్లు వివరించారు. దీంతో ఇసుక మేటలను తొలగించాలని ఇన్‌చార్జ్ పీఓ రమణ ఏపీఎండీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం నేరడి బ్యారేజ్ వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించారు. వీరితో పాటు డీటీ నిమ్మల శేఖరం, మండల సర్వేయర్ రాజేశ్వరరావు, ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓ భారతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన వసతిగృహం పనులు



గర్భిణుల వసతిగృహం పరిశీలిస్తున్న పీఓ వీవీ రమణ

సీతంపేట: గర్భిణుల వసతిగృహ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణ తెలిపారు. వైటీసీలో ఏర్పాటు చేయనున్న వసతిగృహాన్ని శుక్రవారం పరిశీలించారు. మంచాలు, పరుపులు వంటివి నాణ్యమైనవి వేయాలని సంబంధిత సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ సింహాచలం పాల్గొన్నారు.



వైద్యులకు పటిష్ట భద్రత ఉండాలి

విధులు నిర్వహించే ప్రదేశాల్లో మహిళా వైద్యులకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి. 24 గంటల పాటు సీసీ కెమేరాల నిఘా ఉండాలి. రోగి సహాయకులపై నియంత్రణ ఉండాలి. ఒకరికే అనుమతి ఇవ్వాలి. వారికి ఎంట్రీ పాస్ ఇవ్వాలి. పరామర్శకు వచ్చే వారికి పరిమిత వేళల్లో మాత్రమే అనుమతి ఇవ్వాలి.

– డాక్టర్ సీహెచ్ రాణి, వైద్యురాలు, జిల్లా ఆస్పత్రి



సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేయాలి

మహిళల సంరక్షణకు ప్రత్యేక సెల్ సెల్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలు, మహిళా హాస్టళ్లలో భద్రత కట్టుదిట్టం చేయాలి. వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారి రక్షణకు చర్యలు చేపట్టాలి. మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించాలి. మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసులు శ్రద్ధ చూపాలి.

– డాక్టర్ జి.శిరీష, ఎం.సింగనాపురం పీహెచ్‌సీ



గ్రామ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
● గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు

పార్వతీపురంటౌన్:

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎం.ఆర్.నగరంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ఉపాధిహామీ పథకం నిధులతో వాటిని చేపట్టేందుకు ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో గ్రామ స్వరాజ్య స్థాపనకు సమష్టిగా కృషిచేయాలని కోరారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. సాగునీటి సమస్య ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా..సోలార్ విద్యుత్‌తో బోరుబావుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉప సర్పంచ్ త్రినాథనాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, డీఎల్‌డీఓ రమేష్ రామన్, ఎంపీడీఓ షేక్ అబ్దుల్ జావేద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

వెంకంపేట గ్రామసభలో పాల్గొన్న మంత్రి

వెంకంపేటలో నిర్వహించిన గ్రామసభలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు. పంచాయతీ సంస్కరణల కొనసాగింపులో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభ అంటే ఏదో తూతూ మంత్రంగా చేయడం కాకుండా పంచాయతీ ప్రజలంతా కలిసి కూర్చొని గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా నిర్వహిస్తామన్నారు. మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం అనేలా వీటి నిర్వహణ ఉంటుందన్నారు. భారతదేశపు మూలాలు, జీవం పల్లెల్లోనే ఉంటుందని మహాత్మా గాంధీ చెప్పారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర పంచాయతీలను స్వయంశక్తి పంచాయతీలుగా సాకారం చేసుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యేలు విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతలు సూచించిన పనులకే ఆమోదం

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ నిధులతో వాటిని చేపట్టేందుకు గ్రామసభలు నిర్వహించారు. అయితే పలు గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు సూచించిన పనులనే గ్రామసభలో తీర్మానం చేసి ఆమోదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోగింపేటలో ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు ముందుగా చెప్పడంతో గ్రామస్తులంతా సభకు వచ్చారు. కానీ అధికారులు సమయానికి రాకపోవడంతో ప్రజలు పనులకు వెళ్లిపోయారని స్థానిక సర్పంచ్ కె.సింహాచలం వాపోయారు.



మక్కువ: మక్కువలో గ్రామసభ



పార్వతీపురంటౌన్: వెంకంపేట గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్ యాదవ్

మక్కువలో ప్రశాంతంగా..

మక్కువ: మండలంలోని 21 పంచాయతీల్లో శుక్రవారం ఎన్ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రం మక్కువలో నిర్వహించిన గ్రామసభకు జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు హాజరయ్యారు. అలాగే కొయ్యానపేట, కాశీపట్నం, వెంకటభైరిపురం పంచాయతీల్లో ఐసీడీఎస్ పీడీ(మండల ప్రత్యేకాధికారి) ఎం.ఎన్ రాణి, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కన్నంపేట, ఎ.వెంకంపేట పంచాయతీల్లో ఈఓపీఆర్డీ పి.దేవకుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంపద సృష్టిపైనే చంద్రబాబు దృష్టి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పులు చేయడం లేదని, సంపద సృష్టిస్తున్నారని గిరిజన, శిశుసంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కూర్మరాజుపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.4,500 కోట్లు నిధులు మంజూరు చేయించిందన్నారు. గ్రామాల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పనితీరుపై పలు విమర్శలు చేశారు. గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతున్న సమయంలో పలువురు మహిళలు రైతుభరోసా, తల్లికి వందనం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు.

పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కష్టాల్లో మేమున్నామని భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. అచ్యుతాపురం ఘటనలో మృతి చెందిన పార్థసారథి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం అందించిన కోటి రూపాయల పరిహారం చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్

సీతానగరం: ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా సీతానగరం పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఔట్‌పేషెంట్ విభాగం, డిస్పెన్సరీ, మందులు నిల్వ గది, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న వసతులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులు ఉషారాణి, పావని మంత్రికి వివరించారు. అనంతరం పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న భవనాలను మంత్రి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని జోగింపేట కేజీబీవీని వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. కేజీబీవీలో జరుగుతున్న విద్యాబోధన, వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సి.హరికిరణ్, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యేలు బి.విజయచంద్ర, టి.జగదీశ్వరి, నిమ్మక జయరాజు, చిరంజీవి ఆర్డీఓ కె.హేమలత, పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్మోహనరావు, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్ జె.రాములమ్మ, స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచాలని వినతి

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని బెడ్లు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్ యాదవ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో బెడ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ఒక్కోసారి ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యులు చికిత్స చేయాల్సిన పరిస్థితి వస్తోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. బెడ్ల సంఖ్య పెంచడంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సామాజిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. గిరిజన సంఘ నాయకులు దుక్క సీతారాం, కోలక గౌరమ్మ, కేటీఆర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరికి నివాళి



పార్వతీపురంటౌన్: టంగుటూరి ప్రకాశం పంతులకు నివాళులర్పిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురంటౌన్: న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు ఎనలేనివని జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కృషీ విద్యానికేతన్ కరస్పాండెంట్ డి.శ్రీనివాసరావు అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని మండలంలోని గెద్దలుప్పి జంక్షన్ వద్ద ఉన్న పాఠశాలలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బలిజిపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పెదపెంకి గ్రామంలోని నేతాజీ గ్రంథాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవి నాయుడు ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, జి.సాధు, బి.శ్రీను, జి.శంకర్, కె.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద టంగుటూరికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

14న జాతీయ లోక్‌అదాలత్

● సీనియర్ సివిల్‌జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెప్టెంబరు 14న నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులలో కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీ చేయాలని తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి, కక్షిదారులకు సత్వర న్యాయం అందేందుకు ఈ లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం రెండూ ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిణీరావ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.మోహనకుమార్, ఏపీపీ, ఏజీపీ, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

పార్వతీపురంటౌన్:

ఐటీఐ పరీక్షల్లో అవకతవకలు జరగకుండా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఎగ్జామ్ హెల్పింగ్ ఫీజ్ పేరుతో రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఐటీఐలు ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. తక్షణమే ఆర్‌డీడీ స్పందించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే పరీక్ష కేంద్రాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, సాయికిరణ్, మనీ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు

సాలూరు: శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి, పంచముఖేశ్వరి, సంతోషిమాత అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి చీరలో కామాక్షమ్మవారు, బంగారుచీరలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు 108 హారతులు పట్టారు.

బలిజిపేట: శ్రావణ మాసంలో మూడవ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సాలూరు: బంగారుచీరతో భక్తులకు దర్శనమిస్తున్న వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు





సాలూరు: వెండిచీరతో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మతల్లి



వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారికి 108 హారతులు పడుతున్న భక్తులు



కామాక్షమ్మ ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్థన శుక్రవారం తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్ సబ్జెక్టులలో పీజీ విద్యార్హత ఉండి, 50 శాతం మార్కులు కల్గి ఉండాలని వివరించారు. ఈ నెల 26లోగా బయోడేటాతో పాటు విద్యార్హత పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.